క్లుప్తంగా

వైభవంగా ఆడి అమావాస్య పూజలు



భక్తులకు సహపంక్తి భోజనం పెడుతున్న నిర్వాహకులు

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్ర మౌళీశ్వర ఆలయంలో బుధవారం ఆడిఅమావాస్య పూజలు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా చంద్రమౌళీశ్వరుని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో ఆలయానికి హాజరైన భక్తులు అమావాస్య పూజలు చేసుకున్నారు. ఆలయంలో 200 మందికి ఆలయంలో సహపంక్తి భోజనం పెట్టారు. ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

27న ఆటోవర్కర్ల మహాసభ



కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

పుత్తూరు రూరల్: తిరుపతి జిల్లా ఆటో వర్కర్స్ మహాసభను ఈనెల 27న శ్రీకాళహస్తిలో నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఆటో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఆటో వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో వర్కర్స్ సమస్యలపై జిల్లా మహాసభలో పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి ఆటో వర్కర్ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పురుషోత్తం, విజయ్, సుధాకర్, ప్రవీణ్‌కుమార్, రమేష్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద నాణ్యతగా ఉండాలి



విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న సర్పంచ్ అయ్యప్ప

పాలసముద్రం: రాష్ట్రప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందించాలని సర్పంచ్ అయ్యప్ప, పంచాయతీ కార్యదర్శి ధరణి తెలిపారు. బుధవారం వారు పాలసముద్రం ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు అందిస్తున్న రాగిజావ, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం సర్పంచ్ అయ్యప్ప మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం కోసం నాణ్యమైన రాగిజావను అందించాలని సూచించారు. గతంలో మాదిరి లావు బియ్యాన్ని ఎండీఎంకు ప్రభుత్వం సరఫరా చేయడం లేదని, నాణ్యమైన పోర్టిఫైడ్ బియ్యాన్ని రూ.కోట్లు వెచ్చించి ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి కేటాయిస్తోందని వివరించారు. విద్యార్థులు పాఠశాలలోనే భోజనం తినేలా రుచి, శుచిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం కోడిగుడ్డు, చిక్కీలను కూడా అందించాలని కోరారు. అనంతరం వారు రాగిజావను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్, హెచ్ఎం రాధ పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ మన బాధ్యత



సచివాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు

పాలసముద్రం: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం మన అందరి బాధ్యత అని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన వెంగళరాజు కుప్పం గ్రామ సచివాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, సర్పంచ్ లిల్లీ, వైస్ ఎంపీపీ పుష్ప సమక్షంలో ఉపాధిహామీ సిబ్బంది, కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పండ్లతోటల పెంపకం పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని సూచించారు. చెట్లను విచ్చలవిడిగా నరికివేయడం వల్ల వాతావరణంలో కాలుష్యం పెరిగిపోయి మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతోందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలన్నారు. అనంతరం వారు సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓ మార్గరేట్, జేఈ అనూష, సచివాలయ ఉద్యోగులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



మాడవీధుల్లో ఊరేగుతున్న విఘ్నేశ్వరుడు



పాల కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

- భక్తుల స్వహస్తాలతో ద్రౌపదీదేవి అమ్మవారికి పాలాభిషేకం
- అంకురార్పణతో ప్రారంభమైన ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలు
- మాడవీధుల్లో దర్శనమిచ్చిన గణనాథుడు

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మ రాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ జరిగింది. ఆలయ అర్చకులు ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ, వాస్తు శాంతి నిర్వహించారు. సాయంత్రం 9 గంటలకు పుత్తూరు పట్టణానికి చెందిన వన్నె రెడ్డి సమన్వయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మహిళలు కలశాలలో పాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. ఉత్సవమూర్తి ద్రౌపదీదేవి అమ్మవారికి మహిళలు తమ స్వహస్తాలతో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం అర్చకులు శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజులస్వామి వార్లను పట్టువస్త్రాలతో విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భాగవతారిణి సుమతి హరికథా గానం జరిగింది. రాత్రి 7 గంటలకు విఘ్నేశ్వర స్వామిని వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి, మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల సందడి నడుమ ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ప్రతి ఇంటి వద్ద వినాయకుడు భక్తుల నుంచి మంగళ హారతులు అందుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్, ఆలయ నిర్వాహకులు సాల్యాకం ఏలుమలై మొదలి పర్యవేక్షించారు.



అమ్మవారికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

బ్రహ్మోత్సవాల్లో నేడు..

- ఆగస్టు 17న ఉదయం స్వామి, అమ్మవార్లకు పుష్పాలంకరణ, శ్రీద్రౌపదీదేవి జన్మ స్థలమైన చౌటూరు, పరిసర గ్రామాల భక్తుల నుంచి పసుపు కుంకుమ, చీర–సారె తీసుకుని వస్తారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం కామధేనువు వాహనంపై శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఊరేగింపు ఉంటుంది.

బ్రహ్మోత్సవాల్లో వరుసగా..

- 18న ఉదయం 6 గంటలకు గోపూజ, శ్రీకృష్ణ భగవానునికి భక్తులచే పాలాభిషేకం, సాయంత్రం 6 గంటలకు సుమంగళవ్రతం, కుంకుమార్చన, జ్యోతిపూజ, రాత్రి 9 గంటలకు ధ్వజారోహణం
- 25న ఉదయం 6 గంటలకు నంది సేవ, ఆది దంపతులైన శ్రీపార్వతీ పరమేశ్వరులు నంది వాహనంపై నుంచి విచ్చేసి అర్జునునికి పాశుపతాస్త్రం అందించే ఘట్టం, (అర్జునుడు తపస్సు మాను), మధ్యాహ్నం అన్నదానం, రాత్రి 8 గంటలకు రైల్వే స్టేషన్ వద్ద పాటకచేరి, రాత్రి 9 గంటలకు వరలక్ష్మీ దేవికి ద్రౌపదమ్మవారి అలంకరణ, రాత్రి 11 గంటలకు మంచినీళ్ల గుంట వద్ద ×అలుగు₹ ఉత్సవం ఉంటుంది. రాత్రి 1 గంటకు కాళికాదేవికి ఇలావంతుని బలి ఇచ్చే కార్యక్రమం ఉంటుంది.
- 26న ఉదయం 6 గంటలకు గరుడసేవ ఉత్సవం, శ్రీకృష్ణరాయబారం, మధ్యాహ్నం 3 గంటలకు దుశ్శాసుని, దుర్యోధుని వధ, పాండవ విజయం, సాయంత్రం 4 గంటలకు మహారథోత్సవం ఉంటుంది.
- 27న ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనం సేవ, సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, రాత్రి 8 గంటలకు కుంభాగ్రహం నుంచి అలుగును పరిగ్రహించుట, 9 గంటలకు సూర్య ప్రభోత్సవం ఉంటుంది.
- 28న ఉదయం అగ్నిగుండం శాంతి పూజ, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి వసంతోత్సవం. రాత్రి 9 గంటలకు ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులను అందిస్తున్న కంపెనీల ప్రతినిధులు

కార్వేటినగరం: ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలని కోరమాండల్ ఫర్టిలైజర్ రీజనల్ మేనేజర్ ఎస్ఎస్ మాధవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కత్తెరపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీ హెచ్‌ఓడీ సుకుమార్, కోరమాండల్ ఫర్టిలైజర్ రీజనల్ మేనేజర్ ఎస్ఎల్ఎన్ మాధవన్ డీసీఈబీ సెక్రటరీ కే.హేమారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం, డీసీఈబీ సెక్రటరీ హేమారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడానికి కర్మాగారాలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కూడా దాతల సహాయాన్ని అందిపుచ్చుకుని ఉన్నతవిద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో కోరమాండల్ ఎగ్జిక్యూటివ్ మురళి, ఎస్ఎంసీ చైర్మన్ ఉమాపతి, వైస్ ఎంపీపీ చేతేన్ కార్తిక్, ఉప సర్పంచ్ కుప్పయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణపై అవగాహన



పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న జేడీఏ మురళీకృష్ణ

నింద్ర: ఆధునిక పద్ధతులను అనుసరించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ సంచాలకులు మురళీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని అగరం, అత్తూరు, నింద్ర ఆర్‌బీకేలను తనిఖీ చేశారు. అగరం గ్రామంలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి సాగులో చేయవలసిన సూచనలను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. వరిలో చీడ పీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మంచి దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ తులసిరాం, ఆర్‌బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని విమర్శించడం సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెదురుకుప్పం: ప్రజాసంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని విమర్శించడం సరికాదని, అలా విమర్శించే వాళ్లకు పుట్టగతులు ఉండవని ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రామయ్య, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్ అన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో గత 40 ఏళ్లుగా జరగని అభివృద్ధి పనులు సీఎం జగనన్న సారథ్యంలో జరుగుతున్నట్లు గుర్తు చేశారు. బుధవారం వెదురుకుప్పంలో విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడా పైసా ఆశించకుండా ప్రజలకు సేవలందిస్తున్న నాయకుడిపై అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేయడం పద్ధతి కాదన్నారు. వెదురుకుప్పంలో డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం మంజూరుతో పాటు కార్వేటినగరం, పెనుమూరు మండలాల్లో 50 పడకల ఆసుపత్రి, సుమారు రూ.200 కోట్లతో రోడ్లను ఆధునీకరించినట్లు తెలిపారు. టీడీపీ, జనసేన పార్టీలు కనుమరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందయ్య, నేతలు గోవిందన్, యువత రమేష్, బాలు పాల్గొన్నారు.

ఉత్తమ మున్సిపల్ డీఈగా నరేష్



అవార్డు అందుకుంటున్న డీఈ నరేష్

నగరి: నగరి మున్సిపల్ డీఈ నరేష్ ఉత్తమ డీఈగా ఎంపికయ్యారు. స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా చిత్తూరులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీచరణ్, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఆయనకు బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది ప్రశంసలు అందించారు.

గ్రీన్ అంబాసిడర్ల సేవలు ఎనలేనివి



గ్రీన్ అంబాసిడర్లకు దుస్తులు అందిస్తున్న నేతలు

పాలసముద్రం: పరిసరాల పరిశుభ్రతలో గ్రీన్ అంబాసిడర్ల సేవలు ఎనలేనివని సర్పంచ్ గాలి మహేష్‌బాబు, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ అన్నారు. బుధవారం వారు ఎస్‌కేఆర్ పురం రైతు భరోసా కేంద్రంలో గ్రీన్ అంబాసిటడర్లు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో గ్రీన్ అంబాసిడర్లు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు ఎనలేని సేవలు అందించారని చెప్పారు. గ్రామాల్లో పరిసరాల శుభ్రత విషయంలో కూడా బాధ్యతాయుతంగా పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు సక్రమంగా అందించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు గ్రీన్ అంబాసిడర్లకు సొంత నిధులతో దుస్తులు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యశ్వంత్ పాల్గొన్నారు.

నేత పరిశ్రమకు అండగా ప్రభుత్వం

- మరమగ్గ కార్మికులకు ప్రభుత్వ యూనిఫాం ఆర్డర్లు ఇప్పించి ఆదుకున్నాం
- మంత్రి ఆర్‌కే రోజా



లబ్ధిదారులకు సంక్షేమ బావుటా అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి: నేత పరిశ్రమకు అండగా నిలబడింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. నేత కార్మికులు ఎక్కువగా నివశించే మున్సిపల్ పరిధిలోని సత్రవాడలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించారు. స్థానికులు గజమాలలు, దుశ్శాలువలతో హారతులు పట్టి ఆమెను ఆహ్వానించారు. మండలస్థాయి అధికారులతో కలసి ప్రతి గడపకు వెళ్లిన ఆమె నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరమగ్గ కార్మికులకు అనేక విధాలుగా తాము అండగా నిలబడ్డామన్నారు. 20.5 లక్షల మీటర్ల ప్రభుత్వ యూనిఫాం ఆర్డర్లను అందించడం జరిగిందన్నారు. ఈ ఆర్డర్లు 3వేల మందికి కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఉపాధి కల్పించాయన్నారు. ఆప్కో వారి బైలా సవరణ చేసి మరమగ్గ కార్మికులకు ఆర్డర్లు తెప్పించడం జరిగిందన్నారు. ఆధునీకరణ దిశగా నేతపరిశ్రమను నడపాలన్న ఆకాంక్షతో ఆటోలూమ్, అండర్‌పిక్ లూమ్, పట్టుచీరల తయారీ యంత్రాలు అంటూ అత్యాధునిక మరమగ్గాలు అహ్మదాబాద్ మరమగ్గ తయారీ సంస్థతో చర్చించి ట్రయల్ రన్ కింద తెప్పించి శిక్షణ అందించడం జరిగిందన్నారు. నేత పరిశ్రమకు చెందిన వారి వ్యాపారాలను దృష్టిలో ఉంచుకుని ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ నుంచి గతంలో ఆపిన ట్రైన్లను అధికారులతో చర్చించి పునరుద్ధరించడం జరిగిందన్నారు. వివిధ సంక్షేమ పథకాలతో ప్రజలను ఆదుకుంటున్నామని తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సగటున రూ.2 లక్షలకు పైగా లబ్ధి చేకూర్చారని, ఇది ప్రతిపక్షాలకు కంటగింపుగా ఉందన్నారు. ఎలాంటి దుష్ప్రచారాలను నమ్మవద్దని మేలు చేసిన వారిని గుర్తుంచుకుంటే అభివృద్ధికి బాటలు వేసినవారం అవుతామన్నారు.

టీడీపీ నాయకులది అధికార దాహం..

గతంలో ఉన్న నాయకులు ఏంచేశారో, ప్రస్తుతం అధికారంలో ఉన్న తాము ఏంచేశామో ప్రజలు బేరీజు వేసుకుంటే ఎవరు ఎక్కువగా సాయపడుతున్నారో అర్థమవుతుందని మంత్రి రోజా తెలిపారు. టీడీపీ నాయకులకు అధికారదాహం తప్ప ప్రజాశ్రేయస్సు పట్టదన్నారు. 14 ఏళ్ల పాలించిన ఆ పార్టీ ప్రజలకు ఏం మేలు చేసిందో ఆలోచించాలన్నారు. ప్రజలు చెప్పిన సమస్యలను శ్రద్ధగా విన్నారు. వాటిని పరిష్కరించాలని అప్పటికప్పుడే అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్, జిల్లా నేత అనుబంధశాఖ అధ్యక్షుడు కన్నాయిరం, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మెప్మా టీఎల్ఎం సునీత, కౌన్సిలర్లు వెన్నెల, మురుగ, ఎన్సీ ఆనంద్‌కుమార్, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు



దివ్యాంగుడికి రూ.5 వేలు పింఛన్ మంజూరు చేయాలని ఆదేశిస్తున్న ఉప ముఖ్యమంత్రి

– డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం పులికల్లు గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి మేలు చేసేలా సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నారని, కానీ వైఎస్సార్‌సీపీ పాలనలో మాత్రం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాలు అందిస్తున్నామని తెలిపారు. ఇది ఓర్వలేని చంద్రబాబు నాయుడు మాత్రం విమర్శించడం సిగ్గు చేటన్నారు. వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దే అందిస్తుంటే వాటిని కూడా చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ వక్రీకరించి నీతిమాలిన రాజకీయాలు చేయడం సమంజసం కాదన్నారు. ఎన్నికలు వస్తుండడంతో ప్రతిపక్షాల నేతలు పగటి వేషగాళ్లుగా వచ్చి అమలుకు నోచుకోని హామీలు ఇస్తారని, ఎల్లో మీడియాతో రాష్ట్ర ప్రభుత్వంపై విషప్రచారం చేస్తారని, కానీ ప్రజలు మంచి చేసిన వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు.

నడవలేని వారికి రూ.5 వేలు పింఛన్..

పలికల్లు సచివాలయం పరిధిలోని ఎలుమగుండ్లపల్లి గ్రామానికి చెందిన లోకనాథరెడ్డి మట్లాడుతూ నేను పూర్తిగా నడవ లేకపోతున్నానని, తనకు రూ.3 వేలు ఇస్తున్నారని, రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకొచ్చాడు. దీనిపై ఆయన స్పందిస్తూ పూర్తిస్థాయిలో నడవలేని వారికి రూ.5 వేలు పింఛన్ అందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అదేవిధంగా చెర్లోపల్లి ఎస్టీ కాలనీకి చెందిన 20 కుటుంబాలు వారు తాము ఇంకా గుడిసెల్లోనే ఉంటున్నామని డిప్యూటీ సీఎంకు చెప్పగా, వెంటనే వారికి పక్కాగృహాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రత్నమ్మ అనే మహిళ మాట్లాడుతూ తనకు జగనన్న సీఎం అయ్యాక చాలామందికి పెన్షన్లు, రేషన్‌కార్డులు ఇచ్చారని, ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తం చేసింది. అదేవిధంగా గ్రామంలో విద్యుత్, తాగునీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలుపగా, వారం రోజుల్లో మీ సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు మీన, ఎంపీటీసీ జమున, మునిరాజు, పాపయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, నాయకులు కృష్ణారెడ్డి, పండరినాథ్, దాము, నవీన్‌కుమార్‌రెడ్డి, మహేష్‌యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ రవిమనోహర్, హేమాద్రినాయుడు, పూర్ణచంద్రారెడ్డి పలువురు పాల్గొన్నారు.

40 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాలో ప్రసంగిస్తున్న ఐటీఐ ప్రిన్సిపల్

కార్వేటినగరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో 40 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని కార్వేటినగరం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) ప్రిన్సిపల్ మనోహర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఐటీఐ కళాశాలలో బుధవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉన్నత చదువులు అభ్యసించి నిరుద్యోగులుగా ఉంటున్న యువతకు పలు కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. జాబ్‌మేళాకు సుమారు 62 మంది అభ్యర్థులు హాజరు కాగా, అందులో 40 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. అనంతరం జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులకు అనుమతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు చైతన్య, పవన్‌కుమార్, అబ్దుల్ పాల్గొన్నారు.

రైతులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్మన్ రమేష్‌బాబు

నగరి: మండలంలోని ఎం.కొత్తూరు రైతుభరోసా కేంద్రంలో బుధవారం జిల్లా లోక్ అదాలత్ పర్మినెంట్ చైర్మన్ ఎస్.రమేష్‌బాబు రైతులకు చట్టాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో విత్తనాల కొనుగోళ్లలో, ఎరువుల కొనుగోళ్లలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని చట్టం ద్వారా ఎలా పరిష్కరించుకోవచ్చు అనే అంశంపై వివరించారు. న్యాయస్థానాన్ని ఎలా సంప్రదించాలో తెలిపారు. రైతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏపీపీ రామశాంతి, అడ్వొకేట్ సోమసుందరం, వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్, సర్పంచ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం విక్రయిస్తే చర్యలు



కార్వేటినగరం తహసీల్దార్ రవికుమార్

కార్వేటినగరం: ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రవికుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా పంపిణీ ద్వారా ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని అమ్మడం, కొనడం నేరమన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన వారికి ప్రభుత్వం అందించిన రేషన్ కార్డును రద్దు చేస్తామని హెచ్చరించారు. రేషన్ కార్డు ద్వారా పొందుతున్న అన్ని సదుపాయాలను కోల్పోతారని తెలిపారు. మండల పరిధిలో ఎక్కడైనా రేషన్ బియ్యం అమ్ముతున్నట్లు, కొనుగోలు చేసినట్లు తెలిసినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- టీడీపీ ప్రభుత్వంలో దోచుకోవడం తప్ప వేరే ఏమీ చేయలేదు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి జీడీనెల్లూరు రూపురేఖలు మార్చేశారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య

శ్రీరంగరాజపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో నియోజకవర్గంలో భారీగా అభివృద్ధి జరిగిందని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా ? అని టీడీపీ ఇన్‌చార్జ్ థామస్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య సవాల్ విసిరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి సొంత ప్రయోజనలు చూసుకున్నారని ఆరోపించారు. కానీ వైఎస్సార్‌సీపీ పాలనలో గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలో రోడ్డు లేని గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యం, ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందించాలన్న ఉద్దేశంతో సచివాలయ, రైతుభరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, రూ.192 కోట్లతో ఎన్‌టీఆర్ జలాశయం పనులు, అటవీ శాఖ అనుమతులు పొంది రోడ్డు నిర్మాణాలు చేశామన్నారు. అలాగే ఆలయాలు లేని గ్రామాలను గుర్తించి ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలతో 78 ఆలయాల నిర్మాణం, పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో, డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంటే, చూసి జీర్ణించుకోలేని టీడీపీ, జనసేన నేతలు ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని ఆరోపించారు. అలాగే పెనుమూరులో వైఎస్సార్‌సీపీలో ఉంటూ కొందరు టీడీపీకి అనుకూలంగా మసలు కోవడం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. దళితులు అంతా ఐక్యంగా ఉండి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో జనార్దన్, డీఎస్.రాజు, జయరాజ్, అమృతరాజు, రామకృష్ణ, రఘు, బాబు, చంద్రశేఖర్, మార్కొండయ్య తదితరులు పాల్గొన్నారు.